సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 20 । జూలై । 2025



టన్ను చీనీ రూ.15 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.15 వేలు, కనిష్టంగా రూ.3 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.26

అనంతపురం మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.26, కనిష్టంగా రూ.13 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 1,800 టన్నుల టమాట వచ్చింది.

గరిష్టం/కనిష్టం
32.9°/21.7°

జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా మోస్తరు వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

హత్యాయత్నం కేసులో నలుగురి అరెస్ట్

హిందూపురం: హత్యాయత్నం కేసులో నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. సోమందేపల్లి మండలం పోలేపల్లికి చెందిన నరసింహులు ఈ నెల తొమ్మిదో తేదీన ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా మలుగూరు గ్రామం వద్ద వెనుకనుంచి వచ్చిన నలుగురు వ్యక్తులు కత్తితో తలపై దాడిచేశారు. గాయపడిన నరసింహులు గట్టిగా కేకలు వేయడంతో దుండగులు పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు హిందూపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో హత్యాయత్నం కింద కేసు నమోదైంది. కేసులో నిందితులైన పోలేపల్లికి చెందిన శ్రీనివాసులు, చిన్న అంజినప్ప, హిందూపురం నేతాజీనగర్‌కు చెందిన సాయివినయ్, త్యాగరాజనగర్‌కు చెందిన నాగేష్‌ను శనివారం మలుగూరు రైల్వేస్టేషన్ వద్ద అరెస్టు చేసినట్లు సీఐ ఆంజనేయులు చెప్పారు. వ్యక్తిగత కక్షల నేపథ్యంలోనే దాడి చేసినట్లు విచారణలో తేలిందన్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

లింకు నొక్కితే.. రూ.2.35 లక్షలు మాయం



ఫిర్యాదు అందజేస్తున్న నాగభూషణ

కొత్తచెరువు: సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. లింకులు పంపించి.. అవతలి వ్యక్తి నొక్కగానే.. ఫోన్‌ను హ్యాక్ చేసి.. బ్యాంకు ఖాతాల నుంచి నగదు దోచేస్తున్నారు. ఇలాంటి ఘటన ఒకటి వెలుగులోకి వచ్చింది. కదిరేపల్లికి చెందిన టి.నాగభూషణ, గాయత్రి దంపతులు. వీరిద్దరి బ్యాంకు ఖాతాలకు ఒకే ఫోన్ నంబర్ లింక్ అయ్యింది. ఈ క్రమంలో నాగభూషణ ఫోన్‌కు ఈ నెల ఏడో తేదీన గుర్తు తెలియని నంబర్ నుంచి లింకు వచ్చింది. ఆ లింకును ఆయన నొక్కగానే ఫోన్‌ను హ్యాక్ అయ్యింది. ఆ తర్వాత నుంచి నాగభూషణ సెల్‌లో ఫోన్ పే పనిచేయలేదు. వారం రోజుల తర్వాత బ్యాంకు వెళ్లి ఆరా తీయగా నాగభూషణ, గాయత్రి ఖాతాల నుంచి మొత్తం రూ.2,35,000 కట్ అయినట్లు చెప్పారు. దీంతో సైబర్ మోసం జరిగిందని గ్రహించిన బాధితుడు శనివారం కొత్తచెరువు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ప్లాస్టిక్ నిర్మూలనతో పర్యావరణ పరిరక్షణ

- జీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పిలుపు



పెనుకొండలో ర్యాలీలో పాల్గొన్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

పెనుకొండ: ప్లాస్టిక్‌ను నిర్మూలించి పర్యావరణాన్ని కాపాడుకుందామని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళీ శాఖ మంత్రి సవిత పిలుపునిచ్చారు. 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం పెనుకొండ పట్టణంలో విద్యార్థులు, అధికారులు, పట్టణ ప్రజలతో కలసి మంత్రి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలని, పేపర్ బ్యాగ్‌లను వాడాలని కోరారు. పర్యావరణ సమతుల్యత లోపించకుండా జాగ్రత్త వహించాలన్నారు. అనంతరం గాంధీ సర్కిల్లో మానవహారం నిర్వహించారు.

విదేశీ విద్య కలవరం!

- హిందూపురం పట్టణానికి చెందిన నరేష్ సూరత్‌కల్ ఎన్‌ఐటీలో ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. అమెరికాలోని బోస్టన్ వర్సిటీలో సీటు వచ్చింది. అయితే, అక్కడకు వెళ్లేందుకు వీసా స్లాట్ కేటాయించలేదు. దీంతో నరేష్ రోజూ కళ్లకు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నాడు.
- అనంతపురం శారదానగర్‌కు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి కర్ణాటకలోని ప్రముఖ ఇంజినీరింగ్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియాలో ఇతనికి సీటు వచ్చింది. కానీ వీసా కోసం పడరాని పాట్లు పడుతున్నాడు. వీరిద్దరే కాదు.. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎంతో మంది ఇదే సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



- గతంలో ఉమ్మడి జిల్లా నుంచి 300 మందికి పైగా విదేశాలకు..
- ఈ ఏడాది వీసా కష్టాలతో 40 మందికి మించని వైనం
- వీసా స్లాట్‌ల కోసం ఎదురు చూపులు
- కొంతమందికి ఇప్పటికే లోన్ల మంజూరు
- బెస్ట్ యూనివర్సిటీల్లో సీటు వచ్చినా వీసా రాక పాట్లు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన విద్యార్థుల కల చెదిరింది. విదేశాలకు వెళ్లి చదువుకోవాలన్న కోరిక నెరవేరడం లేదు. ఇంజినీరింగ్ పూర్తి చేసి విదేశాల్లో ఎంఎస్ కోసం ఈ ఏడాది ఉమ్మడి జిల్లానుంచి 800 మందికి పైగా దరఖాస్తు చేసుకున్నట్టు ప్రాథమిక అంచనా. కానీ ఇప్పటివరకూ పట్టుమని 40 మందికి కూడా వీసాలు రాలేదని తెలుస్తోంది. వివిధ కన్సల్టెన్సీలు, ఎడ్యుకేషనల్ సంస్థలు ఇచ్చిన సమాచారం మేరకు ఈ ఏడాది పదుల సంఖ్యలోనే విద్యార్థులకు అవకాశం వచ్చినట్టు వెల్లడైంది. ఇంజినీరింగ్‌తో ఇక్కడ ఉద్యోగం రాక, అమెరికాలో ఎంఎస్ చదవడానికి అవకాశం రాక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

పడరాని పాట్లు..

డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడయ్యాక విదేశీ విద్యార్థులకు నిబంధనలు కఠినతరం చేసిన విషయం తెలిసిందే. దీంతో మన విద్యార్థులకు ఇబ్బంది ఎదురవుతోంది. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులకు మంచి యూనివర్సిటీల నుంచి ఆమోదం లభించింది. ఇందుకు సంబంధించి ఐ–20 ఫాంలు వచ్చాయి. వీటి ఆధారంగానే వీసా ఇంటర్వ్యూకు వెళతారు. కానీ వీసా స్లాట్‌లు కేటాయించకపోవడంతో రేయింబవళ్లు ఎదురు చూస్తున్నారు. అమెరికాలో మెజారిటీ యూనివర్సిటీలు ఆగస్టు 20 నుంచి సెప్టెంబర్ 20 లోగా తరగతులు ప్రారంభిస్తాయి. ఐ- 20 ఆధారంగా ఇప్పటికే బ్యాంకు లోన్లు మంజూరు చేశారు. వీసా ఇంటర్వ్యూ ఆమోదం లభిస్తే చాలు వెళ్లిపోవాలని ఆలోచన. కానీ వీసా స్లాట్‌లు లభించకపోవడంతో విదేశాలకు వెళ్లాలనే కల నెరవేరడం లేదు. ఆస్ట్రేలియా, కెనడా లాంటి దేశాల్లో అవకాశాలున్నా రకరకాల కారణాలతో అక్కడకు వెళ్లే వారి సంఖ్య చాలా తక్కువగా ఉంది.

విదేశీ విద్యకు రాయితీ ఏదీ..?

గత ప్రభుత్వ హయాంలో జగనన్న విదేశీ విద్యా దీవెన కింద 50 శాతం నుంచి 100 శాతం వరకూ ఫీజు రాయితీ పొందిన అభ్యర్థులున్నారు. వరల్డ్ క్యూఎస్ ర్యాంకింగ్స్‌ను బట్టి రాయితీ ఇచ్చారు. కానీ ఈ ప్రభుత్వం వచ్చాక విదేశీ విద్యకు రాయితీలు తొలగించడంతో పేద విద్యార్థులు విదేశాల్లో చదివే అవకాశం కోల్పోతున్నారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పరిస్థితి ఇలా

2023-24లో అమెరికాకు వెళ్లిన విద్యార్థులు	400 మందికి పైగా
ఈ ఏడాది దరఖాస్తు చేసుకున్న వారు	800 మందికి పైగా (అంచనా)
ఇప్పటివరకూ వీసాలు వచ్చినది	40 మందికి మాత్రమే
ఐ 20లు వచ్చిన వారు	350 మందికి పైగా (అంచనా)

హైకోర్టు జడ్జికి ఘన స్వాగతం



జస్టిస్ రామకృష్ణ ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అనంత కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ జి. రామకృష్ణ ప్రసాద్‌కు శనివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఘన స్వాగతం పలికారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన జస్టిస్ రామకృష్ణ ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలెక్టర్ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్ కూడా ఉన్నారు.

- అదే విధంగా ఉమ్మడి జిల్లా ఎస్పీలు పి. జగదీష్, వి. రత్న మర్యాదపూర్వకంగా జస్టిస్ రామకృష్ణ ప్రసాద్‌ను కలిశారు.



మర్యాదపూర్వకంగా భేటీ అయిన ఎస్పీలు జగదీష్, రత్న

సమాచారం కోరితే ఇవ్వాల్సిందే

- ఆర్టీఐ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి
- సిబ్బందికి ఏపీఎంఐపీ పీడీ, ఉద్యానశాఖ అధికారి ఆదేశం



మాట్లాడుతున్న డీహెచ్‌ఓ చంద్రశేఖర్

పుట్టపర్తి అర్బన్: సమాచార హక్కు చట్టం ద్వారా ఎవరైనా వివరాలు కోరితే కచ్చితమైన సమాచారం అందించాలని ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్ అధికారులకు సూచించారు. శనివారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం అమలుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ప్రజలకు వజ్రాయుధం లాంటిదన్నారు. దీనిని ఎవరూ చులకన చేయరాదన్నారు. అనంతరం ఆర్జీఐ అర్జీలకు ఎన్ని రోజుల లోపు సమాధానం ఇవ్వాలి, సమాచారం ఏవిధంగా రికార్డు చేయాలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమాచార హక్కు చట్టం అమల్లో నిర్లక్ష్యం వహిస్తే తలెత్తే పరిణామాలు తెలియజేశారు. సమావేశంలో హెచ్‌ఓలు, ఎంఐఏఓలు, ఎంఐ ఇంజినీర్లు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

బొమ్మనహాళ్: రైతులు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. శనివారం బొమ్మనహాళ్ సమీపంలోని హెచ్చెల్సీలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, టీబీ డ్యాం ఎస్ఈ నారాయణ నాయక్, ఆయకట్టు రైతులు గంగపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలవ మాట్లాడుతూ జిల్లాకు జీవనాడి అయిన తుంగభద్ర ఎగువ కాలువకు జూలై 20లోపే నీటిని తీసుకొచ్చి హారతి ఇచ్చామన్నారు. టీబీ డ్యాంలో ఈ ఏడాది కొత్త గేట్లు అమర్చబోతున్నారని, ఈ క్రమంలో నీరు ముందుగానే బంద్ అయ్యే అవకాశాలున్నాయన్నారు. రైతులు ఇబ్బంది పడకుండా ఆ మేరకు పంటలను సాగు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్చెల్సీ డీఈఈ దివాకర్‌రెడ్డి, జేఈలు రంజిత్‌కుమార్, అల్తాఫ్, తుంగభద్ర పాజెక్టు వైస్ చైర్మన్ కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మామిళ్లకుంట క్రాస్‌లో 'గ్రీవెన్స్' భవనం



మామిళ్ల కుంట క్రాస్‌లో నిర్మాణంలో ఉన్న భవనం

- రూ.80 లక్షల వ్యయంతో నిర్మాణం
- నెలరోజుల్లో అందుబాటులోకి వచ్చే అవకాశం

పుట్టపర్తి అర్బన్: ప్రతి సోమవారం నిర్వహించే జిల్లా స్థాయి 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (గ్రీవెన్స్) కోసం నూతన భవనాన్ని నిర్మిస్తున్నారు. పుట్టపర్తి మండలంలోని మామిళ్లకుంట క్రాస్‌లో రూ.80 లక్షల వ్యయంతో చేపట్టిన నూతన భవన నిర్మాణం శరవేగంగా సాగుతోంది. ప్రస్తుతం కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో నిర్వహిస్తుండగా జిల్లా నలుమూలల నుంచి జనం తరలిరావడం.. వివిధ సమస్యల పరిష్కారానికి రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు కలెక్టరేట్ ఎదుటే సోమవారం ధర్నా నిర్వహిస్తుండటంతో పట్టణవాసులతో పాటు ప్రశాంతి నిలయం వచ్చే సత్యసాయి భక్తులకు, సత్యసాయి జనరల్ ఆస్పత్రికి వచ్చే రోగులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ సమస్యపై ఇప్పటికే సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్‌కు, జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి.

వేదిక మార్పునకు నిర్ణయం

కలెక్టరేట్ వద్ద ప్రతి సోమవారం నిర్వహించే నిరసన కార్యక్రమాల వల్ల కలుగుతున్న ఇబ్బందులను గుర్తించిన కలెక్టర్ చేతన్ 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమ నిర్వహణను కలెక్టరేట్‌లో కాకుండా మరోచోటకు మార్చాలని నిర్ణయించారు. ఇందుకోసం మామిళ్లకుంట క్రాస్‌లో ప్రశాంతి రైల్వే స్టేషన్ పక్కన సెరికల్చర్ కార్యాలయానికి సంబంధించిన ఎకరా విస్తీర్ణంలోని భూమిని సేకరించారు. అనంతరం రూ.80 లక్షల వ్యయంతో పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో భవన నిర్మాణానికి టెండర్ పిలవగా... ధర్మవరానికి చెందిన ఓ కంట్రాక్టర్ పనులు దక్కించుకున్నాడు. ఈ నూతన భవనంలో అర్జీలు ఇచ్చేందుకు వచ్చే ప్రజలు వేచి ఉండడానికి విశాలమైన హాలు, కలెక్టర్ విశ్రాంతి గది నిర్మిస్తున్నారు. అలాగే 50 మంది అధికారులు కూర్చునేందుకు వీలుగా వేదిక, 300 మందికిపైగా ప్రజలు కూర్చునేందుకు వీలుగా హాలు, మరుగుదొడ్లు, ర్యాంప్ సిద్ధమవుతున్నాయి. ఆగస్టు నాటికి భవనం అందుబాటులోకి వస్తుందని పంచాయతీ రాజ్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆగస్టు నుంచే నూతన భవనంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించాలని యంత్రాంగం భావిస్తోంది.

సమష్టి కృషితోనే ప్లాస్టిక్ రహిత సమాజం



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్



కాలేజీ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు, ప్రజలు, అధికారులు

- ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలి
- 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర' ర్యాలీలో కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపు

ధర్మవరం అర్బన్: సమష్టి కృషితోనే ప్లాస్టిక్ రహిత సమాజం సాధ్యమని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. శ్రీ సత్యసాయి జిల్లాను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకారం అందించాలని కోరారు. శనివారం పట్టణంలో 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, అధికారులు, పట్టణ ప్రజలతో కలిసి నిర్వహించిన ర్యాలీకి కలెక్టర్ చేతన్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కాలేజీ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... మానవాళి మనుగడకు ప్లాస్టిక్‌ను నిర్మూలించడం ఎంతో ముఖ్యమన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లకు బదులుగా జూట్ బ్యాగులు వినియోగించాలని సూచించారు. షాపింగ్‌కు వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరూ జూట్ బ్యాగు వెంట తీసుకువెళ్లాలన్నారు. వ్యాపారులు కూడా ప్లాస్టిక్ కవర్లకు బదులు జూట్, క్లాత్ బ్యాగులను వినియోగదారులకు ఇవ్వాలన్నారు. ప్లాస్టిక్ నిర్మూలనలో భాగంగా జూట్ బ్యాగులు, స్టీల్ వాటర్ బాటిల్స్ వినియోగంపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా అందరితో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. స్వచ్ఛతా కార్మికులు పుల్లన్న, కాటమయ్యను కలెక్టర్ శాలువాలతో సన్మానించారు. అనంతరం గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన బటర్ ఫ్లై పార్కు, రైల్వేస్టేషన్ రోడ్డులోని మున్సిపల్ పార్కులను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహేష్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, తహసీల్దార్ సురేష్‌బాబు, మున్సిపల్ టీపీఓ పెనుబోలు విజయభాస్కర్, మెప్మా సీఓలు, ఆర్పీలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

పాత వాహనాలపై పచ్చ కన్ను

- పదేళ్ల క్రితం హంద్రీ-నీవా పనులు
- పూర్తయ్యాక వాహనాలు వదిలేసి వెళ్లిన కన్‌స్ట్రక్షన్ సంస్థ
- గుజిరీకి విక్రయించేందుకు 'తమ్ముళ్ల' యత్నం
- వాటిని కంపెనీ ప్రతినిధులు తీసుకెళ్లకుండా అడ్డుకున్న వైనం

సాక్షి టాస్క్‌ఫోర్స్: దౌర్జన్యం చేయడం, దోచుకోవడం టీడీపీ నేతలకు వెన్నతో పెట్టిన విద్య. అధికారం ఉందన్న ధైర్యంతో అందిన వచ్చిన ప్రతి అవకాశాన్నీ వాడుకునే టీడీపీ నేతలు..చివరకు పాత సామగ్రి కోసం పోటీపడుతున్నారు. ఇందుకోసం ముఖ్యనాయకుడి వద్దే పంచాయితీ పెట్టారు. 'తమ్ముళ్ల' నిసిగ్గు వ్యవహారం బయటకు పొక్కితే పరువుపోతుందని భావించిన సదరు నాయకుడు ప్రస్తుతానికి వివాదం సద్దుమణిగించారు.



టీడీపీ నేతలు కన్నేసింది ఈ వాహనాలపైనే..



తుక్కు వాహనాల కోసం పోటీ

పుట్టపర్తి ప్రాంతంలో పదేళ్ల క్రితం హంద్రీ-నీవా రెండో దశ కాలువ పనులను పల్లవి కన్‌స్ట్రక్షన్స్ సంస్థ చేపట్టింది. పనులు పూర్తయ్యాక మరమ్మతుకు గురైన హిటాచీ, టిప్పర్లను బుక్కపట్నం మండలం కింకిరివాండ్లపల్లి వద్ద ఉంచేసింది. ఆ తర్వాత వాటి గురించి సదరు సంస్థ మరచిపోయింది. ఈలోపు వాహనాలన్నీ తుప్పుపట్టిపోయాయి. ప్రస్తుతం గుజిరీకి విక్రయించేందుకు తప్ప ఎందుకూ పనికి రావు. అయితే ఈ వాహనాలు గుజిరీకి విక్రయించినా రూ.50 లక్షల దాకా వచ్చే అవకాశం ఉండటంతో స్థానిక టీడీపీ నాయకులు కన్నేశారు. గుట్టుగా తరలించి విక్రయించేందుకు సిద్ధమయ్యారు. అయితే.. టీడీపీలోనే మరో వర్గం వారు తమకూ భాగం కావాలని పట్టుబట్టడంతో వివాదం రేగింది.

అడ్డుకున్న 'తమ్ముళ్లు'

టీడీపీ నేతలు తమ వాహనాలను తుక్కు కింద విక్రయించేందుకు సిద్ధమైన విషయం తెలుసుకున్న పల్లవి కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ప్రతినిధులు వాటిని తీసుకెళ్లేందుకు రెండు రోజుల క్రితం వచ్చారు. నేరుగా పోలీసు స్టేషన్‌కు వెళ్లి పోలీసుల సాయంతో వాహనాలు తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యారు. అయితే అప్పటికే వాటిపై కన్నేసిన టీడీపీ నాయకులు తమకు కనీసం కమీషన్ అయినా ఇవ్వాలని పట్టుబట్టారు. అందుకు సంస్థ ప్రతినిధులు అంగీకరించకపోవడంతో నానా యాగీ చేసి వాహనాల తరలింపును అడ్డుకున్నారు.

పంచాయితీ చేసిన ముఖ్యనేత

టీడీపీ నేతల దిగజారుడు వ్యవహారం తెలుసుకున్న 'ముఖ్య నేత'..ఈ విషయం ప్రజలకు తెలిస్తే పరువుపోతుందని భావించారు. వెంటనే టీడీపీ నాయకులను, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులను పిలిపించారు. ప్రస్తుత పరిస్థితుల్లో వాహనాలను ఎవరూ తరలించవద్దని ఆదేశాలిచ్చారు. దీంతో ప్రస్తుతానికి 'పాత వాహనాల పంచాయితీ'కి బ్రేక్ పడింది.

క్లుప్తంగా

బాలిక ప్రసవంపై డీఎస్పీ విచారణ

అమడగూరు: బాలిక ప్రసవించిన ఘటనపై డీఎస్పీ విచారణ చేపట్టారు. కర్ణాటక ప్రాంతానికి చెందిన బాలిక కొంతకాలం కిందట అమడగూరు మండలంలోని బంధువుల ఇంటికి వచ్చింది. ఈ క్రమంలో ఆమె గర్భం దాల్చింది. అమడగూరు ప్రభుత్వాస్పత్రిలో ఈ నెల 14న ప్రసవించింది. ఆ సమయంలో అమ్మాయి ఆధార్, భర్త వివరాలు అడగ్గా విషయం తెలుగులోకి వచ్చింది. బాలికకు వివాహం కాలేదని తెలిసింది. అనంతరం వైద్యుల ఫిర్యాదు మేరకు డీఎస్పీ విజయ్‌కుమార్ బాలిక ఉంటున్న గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల ప్రాంతాల వారిని విచారణ చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ మహేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తల్లీ పిల్లల అదృశ్యం


పిల్లలతో మాధవి (ఫైల్)

గుత్తి: గుడికని వెళ్లిన తల్లీ పిల్లలు అదృశ్యమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుత్తిలో గాంధీనగర్ కాలనీకి చెందిన మాధవి తన కుమారుడు, కుమార్తెతో కలిసి రెండు రోజుల క్రితం గుడికి వెళ్తున్నానని ఇంటిలో చెప్పి వెళ్లింది. తర్వాత తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఎన్ని చోట్ల గాలించినా ఎక్కడా కనిపించలేదు. మాధవి తండ్రి వెంకటరాముడు శుక్రవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్ శనివారం తెలిపారు.

పోలీసులపై దాడికి యత్నం

హిందూపురం: గస్తీ తిరుగుతున్న పోలీసులపై రౌడీషీటర్ దాడికి యత్నించాడు. టూటౌన్ ఏఎస్‌ఐ మోతీలాల్‌నాయక్, కానిస్టేబుల్ రాజు శుక్రవారం రాత్రి గస్తీ తిరుగుతున్నారు. ఆ సమయంలో తారసపడిన రహమత్‌పురం సర్కిల్‌కు చెందిన రౌడీషీటర్ ఇర్ఫాన్‌ను ఎందుకు బయట తిరుగుతున్నావని ప్రశ్నించారు. దీంతో అతడు దురుసుగా వ్యవహరిస్తూ పోలీసుల ద్విచక్రవాహనాన్ని తన్నాడు. దీంతో పోలీసులు కింద పడిపోయారు. గస్తీ పోలీసుల ఫిర్యాదు మేరకు రౌడీషీటర్ ఇర్ఫాన్‌పై కేసు నమోదు చేశారు.

ఉద్యానం వైపు.. రైతు చూపు

- సంప్రదాయ పంటల్లో తరచూ నష్టాలు
- పంట మార్పిడి కోసం రైతుల ఆసక్తి
- కూరగాయలు, పండ్లు, పూల తోటల సాగుకు మొగ్గు


గోరంట్ల వద్ద సాగైన టమాట పంట


పుట్టపర్తి వద్ద సాగైన బంతిపూల తోట

పుట్టపర్తి అర్బన్: సంప్రదాయ పంటల్లో నష్టాలు వస్తుండటంతో రైతులు బహుళ పంటల వైపు దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఉద్యాన పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. క్రమంగా వీటి సాగు విస్తీర్ణం కూడా పెరుగుతోంది. సాధారణంగా ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ, కంది, మొక్కజొన్న, సజ్జ పంటలు సాగయ్యేవి. ఏటా నష్టాలు వస్తుండడంతో ఇబ్బంది పడుతున్న రైతులు ఆలోచన మార్చుకున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించలేకున్నా ప్రైవేటు మార్కెట్‌లపై ఆధార పడి పలు రకాల కూరగాయలు, పూల తోటలు సాగు చేస్తున్నారు. ఏటా ఉద్యాన శాఖ సహకారంతో జిల్లాలో సుమారు 64 వేల హెక్టార్లలో పంటలు సాగు చేస్తారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 64,359 హెక్టార్లలో పండ్ల తోటలు, కూరగాయలు, పూలు, మసాలా దినుసులు వంటి పలు రకాల తోటలను సాగు చేశారు.

16,137 హెక్టార్లలో కూరగాయలు

జిల్లాలో చీనీ, మామిడి, బొప్పాయి, అరటి, జామ, దానిమ్మ, సపోట, ద్రాక్ష, కళింగర, దోస పంటలు దాదాపు 42,679 హెక్టార్లలో సాగవుతున్నాయి. ఇక ఉల్లి, టమాట, ఆలూ, బెండ, వంకాయ, దోస, బీన్స్ తదితర రకాల కూరగాయల పంటలు 16,137 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. మసాలా దినుసులు ఎండు మిర్చి, చింతపండు, పసుపు, ధనియాలు, కొత్తిమీర, తమలపాకు తోటలు 3,702 హెక్టార్లు, పూల మొక్కలైన రోజా , జాస్మిన్, బంతి పూలు, కనకాంబరాలు, చామంతి తదితర రకాలను 619 హెక్టార్లలో సాగు చేశారు. గత ప్రభుత్వంలో ఉచితంగా బోర్లు వేయించడంతో రైతులు సద్వినియోగం చేసుకొని ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెంచారు. బోర్లలో నీళ్లు సమృద్ధిగా ఉండడంతో దీర్ఘకాలిక పంటలతో పాటు సీజనల్‌గా కూరగాయలు, ఆకు కూరలు పంటలు సాగు చేస్తూ లబ్ధి పొందుతున్నారు. జిల్లా వాసులకు బెంగళూరు, మదనపల్లి, బాగేపల్లి, డీక్రాస్, హిందూపురం, అనంతపురం తదితర మార్కెట్లలో పంట ఉత్పత్తులను విక్రయిస్తున్నారు.


పెడపల్లి వద్ద సాగు చేసిన ఉల్లి పంట

కూరగాయల సాగుతో ఊరట



ఈ ఖరీఫ్ సీజన్‌లో ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో టమాట, ఉల్లి, వంకాయ సాగు చేశాను. పంట ఉత్పత్తులను డీక్రాస్, బాగేపల్లి, బెంగళూరు మార్కెట్‌లలో అమ్ముతాను. పలు రకాలు సాగు చేయడంతో ఏదో ఒక పంటకు గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయి. కూలీల ఖర్చులు బాగా పెరిగాయి. సుదూర ప్రాంత మార్కెట్ లకు కూరగాయలు తరలించడం చాలా ఖర్చుతో కూడుకున్నది. స్థానికంగా మార్కెట్‌లు ఏర్పాటు చేస్తే రవాణా ఖర్చులు తగ్గుతాయి.

– జనార్ధన్‌రెడ్డి, రైతు, పెడపల్లి, పుట్టపర్తి మండలం

ఆ పంటలు లాభదాయకమే



నాకు 9 ఎకరాల పొలం ఉంది. అందులో చిక్కుడు, టమాట, అలసంద, మొక్కజొన్న, కంది సాగు చేస్తున్నాను. పంట ఉత్పత్తులను అనంతపురం మార్కెట్‌కు తీసుకెళ్తున్నాం. ఉద్యానశాఖ అధికారుల సూచనలు పాటిస్తూ మంచి దిగుబడులు సాధిస్తున్నా. కూరగాయలతో అధిక లాభాలు సాధించవచ్చని ఏటా ఆ పంటలే పెడుతున్నా.

– కమతం మల్లేష్, బత్తలపల్లి

లాభ నష్టాలు సహజం



కూరగాయలు, పూలు, పండ్ల తోటల సాగులో లాభాలతో పాటు నష్టాలు ఉండటం సహజం. రైతులు ఎప్పటికప్పుడు అధికారుల సూచనలు తప్పక పాటించాలి. కొన్నిసార్లు వాతావరణం అనుకూలంగా ఉండకపోవచ్చు. ఏక పంట విధానం వదిలి బహుళ పంటలు సాగు చేయడం ఉత్తమం. కూరగాయలు, పండ్లు, పూల తోటలు సాగు విస్తీర్ణం పెరిగింది.

– చంద్రశేఖర్, జిల్లా ఉద్యానశాఖ అధికారి

అసభ్య ప్రవర్తన, దాడి కేసులో నిందితుడి అరెస్ట్


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీఐ మారుతీ శంకర్

కొత్తచెరువు: అసభ్యకర ప్రవర్తన, మహిళలపై దాడి ఘటన కేసులో నిందితుడైన మండల కేంద్రం కొత్తచెరువుకు చెందిన శ్రీనివాసులును పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ మారుతీ శంకర్ శనివారం మీడియాకు వెల్లడించారు. ఈ నెల 11న ఓ కాలనీకి చెందిన శ్రీనివాసులు ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు అడ్డు చెప్పబోయిన ఆమె తల్లిపై విచక్షణారహితంగా కాలనీలో అందరూ చూస్తుండగా దాడి చేశాడు. బాధిత మహిళల ఫిర్యాదు మేరకు 15న పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ మేరకు నిందితుడు శ్రీనివాసులును పోలీసులు శనివారం అతని ఇంటివద్దనే అరెస్టు చేశారు. అనంతరం రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. స్త్రీలు, పిల్లల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, దౌర్జన్యం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే రౌడీషీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.

స్విమ్మింగ్ పోటీల్లో కార్తికేయ సత్తా

విశాఖ స్పోర్ట్స్: విశాఖ సాగర తీరంలోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శనివారం అంతర్ జిల్లాల స్విమ్మింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. గ్రూప్–1, 2, 3 కేటగిరీల్లో బాలబాలికలకు బటర్‌ఫ్లై, బ్యాక్ స్ట్రోక్, బ్రెస్ట్‌స్ట్రోక్, ఫ్రీస్టయిల్ అంశాల్లో పోటీలు జరిగాయి. అనంతపురానికి చెందిన స్విమ్మర్ కార్తికేయ సత్తా చాటాడు. గ్రూప్–1లో బాలుర 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్, 200 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగాల్లో అనంతపురానికి చెందిన ఎస్.కార్తికేయ విజేతగా నిలిచాడు.

ఏడీఏగా అల్తాఫ్ అలీఖాన్

- 40 రోజుల తర్వాత వెల్లడైన బదిలీ జాబితా
- ఉత్తర్వులు వచ్చిన గంటల వ్యవధిలోనే జాయినింగ్


జేడీఏ ఉమామహేశ్వరమ్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అల్తాఫ్ అలీఖాన్

అనంతపురం అగ్రికల్చర్: అత్యంత కీలకమైన వ్యవసాయశాఖ అనంతపురం డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)గా జీఎం అల్తాఫ్ అలీఖాన్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం కమిషనరేట్ నుంచి బదిలీ ఉత్తర్వులు వెల్లడయ్యాయి. ఈ స్థానం కోసం పోటీలో ఉన్న జి.క్రిష్ణయ్యను హిందూపురం ఏడీఏగా బదిలీ చేశారు. అల్తాఫ్ అలీఖాన్ ప్రస్తుతం హిందూపురం ఏడీఏగా ఉన్నారు. ఇప్పటి వరకు అనంతపురం ఏడీఏగా ఉన్న జి.రవిని తాడిపత్రికి బదిలీ చేసిన విషయం తెలిసిందే. బదిలీ సమయంలో ధర్మవరంలో పనిచేస్తున్న క్రిష్ణయ్య తాడిపత్రి కావాలని దరఖాస్తు చేసుకున్నారు. అనంతపురం స్థానం కోసం ఆయన కోరుకోకున్నా... బది'లీల'ల్లో భాగంగా పోటీలోకి తెచ్చారు. కాగా సాధారణ బదిలీల్లో భాగంగా గత నెల 9న విడుదల చేసిన మొదటి జాబితాలోనే ఈ ఇరువురు అధికారులకు ఇవే స్థానాలు కేటాయించారు. అయితే అదే రోజు ఉన్నఫళంగా వెనక్కు తీసుకున్నారు. అప్పటి నుంచి నాటకీయ పరిణామాలు, పైరవీలు, సిఫారసులు, రాజకీయ జోక్యం అధికం కావడంతో దాదాపు 40 రోజుల పాటు ఎటూ తేల్చకుండా ఉంచారు. అనంతపురం ఏడీఏ స్థానం అంశం సీఎం, మంత్రులు లోకేష్, అచ్చెన్నాయుడుతో పాటు ఉన్నతస్థాయి అధికారుల వరకు మరోసారి వెళ్లినట్లు చెబుతున్నారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, కొందరు డీలర్లు అల్తాఫ్ కావాలని, కమిషనరేట్ అధికారులు, అసోసియేషన్ నాయకులు క్రిష్ణయ్య కావాలంటూ పట్టుపట్టినట్లుగా చెబుతున్నారు. ఇలా వ్యవసాయశాఖ పరిధిలో అనంతపురం ఏడీఏ స్థానం కీలకం కావడంతో క్రిష్ణయ్య అంటూ ఉదయం, అల్తాఫ్ అంటూ సాయంత్రం ఇలా రోజూ ఇరువురు అధికారుల పేర్లు చక్కర్లు కొడుతూ వచ్చాయి. ఎట్టకేలకు అల్తాఫ్ అలీఖాన్‌ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువరించి ఉత్కంఠకు తెరదించారు. ఉత్తర్వులు వెలువడిన గంటల వ్యవధిలోనే అల్తాఫ్ అలీఖాన్ సత్యసాయి జిల్లాలో రిలీవ్ అయ్యి అనంతపురం జేడీఏ ఉమామహేశ్వరమ్మను కలిసి జాయినింగ్ రిపోర్టు ఇచ్చారు.

సీమకు తీరని అన్యాయం

- చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉమాపతి ధ్వజం



మాట్లాడుతున్న గాజుల ఉమాపతి

అనంతపురం కార్పొరేషన్: రాయలసీమకు చంద్రబాబు తీరని అన్యాయం చేశారని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు గాజుల ఉమాపతి ధ్వజమెత్తారు. శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కర్నూలులో లా యూనివర్సిటీ, హెచ్‌ఆర్‌సీ, హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటే.. కూటమి ప్రభుత్వం వాటిని అమరావతికి తరలించి రాయలసీమకు తీరని అన్యాయం చేశారన్నారు. లోకాయుక్తను తరలించేందుకు సీఎం చంద్రబాబు కుట్ర చేస్తున్నారన్నారు. హంద్రీ–నీవాను ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసింది చంద్రబాబేనన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ కారణంగానే హంద్రీ–నీవా నీరు వస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌని నాగన్న, ఆర్‌టీఐ విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, న్యాయవాదులు రాజశేఖర్ యాదవ్, బాబ్జీ మాట్లాడుతూ రాష్ట్ర విభజనలో భాగంగా అనంతపురం జిల్లాకు ఎయిమ్స్ మంజూరైతే.. దాన్ని అమరావతికి తరలించిన దుర్మార్గుడు చంద్రబాబు అని మండిపడ్డారు. ఎయిమ్స్ ఏర్పాటై ఉంటే జిల్లాలో వైద్య సేవల్లో నాణ్యత పెరగడమే కాకుండా వందలాది మందికి ఉపాధి లభించేదన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, న్యాయవాదులు మురళీధర్, రమణారెడ్డి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో కాలువలో పడి వ్యక్తి మృతి


మృతి చెందిన షామీర్ బాషా

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లోనికోటకు చెందిన పటాన్‌షామీర్‌బాషా (55) శనివారం ఉదయం మార్కెట్ వీధిలో నడుచుకుంటూ వెళ్తుండగా గుండెపోటు రావడంతో పక్కనే ఉన్న మురుగుకాలువలోకి పడి మృతి చెందాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు ఆరా తీశారు. అనంతరం తమ్ముడు మహమ్మద్‌బాషా, కుటుంబ సభ్యులు వచ్చి షామీర్ బాషా మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. షామీర్ బాషా కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, ఈ క్రమంలోనే గుండెపోటు వచ్చి ఉంటుందని వారు తెలిపారు.

పాడి ఆవుల అపహరణ

కొత్తచెరువు: మండల కేంద్రంలో నాలుగు పాడి ఆవులు అపహరణకు గురయ్యాయి. నామగుండ్ల వీధికి చెందిన నంబి క్రిష్ణమూర్తి వ్యవసాయంతో పాటు పాడి పెంపకంతో జీవనం సాగిస్తున్నాడు. కొత్తచెరువు సమీపంలోని శిలేబద్దు వద్దనున్న పొలంలోని షెడ్డులో కట్టేసిన నాలుగు పాడి ఆవులను ఈ నెల 12వ తేదీ రాత్రి దుండగులు అపహరించుకుపోయారు. మరుసటిరోజు ఉదయం ఆవులు కనిపించకపోవడంతో నంబిక్రిష్ణమూర్తి చుట్టు పక్కల ప్రాంతాల్లో గాలించారు. అయినా ఎక్కడా ఆచూకీ లభించలేదు. రూ.1.05లక్షలు విలువ చేసే నాలుగు పాడి ఆవులు అపహరణకు గురయ్యాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు శనివారం తెలిపారు.

హెచ్చెల్సీ ఇన్‌చార్జ్ ఎస్‌ఈగా సుధాకర్‌రావు


శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఉద్యోగులు

అనంతపురం సెంట్రల్: హెచ్చెల్సీ ఇన్‌చార్జ్ ఎస్‌ఈగా సుధాకర్‌రావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇరిగేషన్ సర్కిల్ డీఎస్‌ఈగా పనిచేస్తున్న ఈయనకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇది వరకు ఇరిగేషన్ సర్కిల్ ఎస్‌ఈ విశ్వనాథరెడ్డి హెచ్చెల్సీ ఇన్‌చార్జ్ ఎస్‌ఈ గా వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన ఇన్‌చార్జ్ ఎస్‌ఈకి ఉద్యోగులు శుభాకాంక్షలు తెలియజేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

అమరాపురం: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు పరిస్థితి విషమించి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. ఉదుగూరు గ్రామానికి చెందిన శివకుమార్ (28) పొట్టకూటి కోసం బెంగళూరుకు వలస వెళ్లి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం బెంగళూరు నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. కర్ణాటక రాష్ట్రం చిరుతహళ్లి అటవీప్రాంతంలో అదుపుతప్పి కిందపడ్డాడు. తలకు బలమైన గాయాలు కావడంతో అటువైపు వచ్చిన వారు గమనించి చిరుతహళ్లిలో ప్రథమ చికిత్స అనంతరం బెంగళూరులోని విక్టోరియా ఆస్పత్రికి తరలించారు. అయినా పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందినట్లు వైద్యులు చెప్పారని కుటుంబ సభ్యులు వెల్లడించారు. శివకుమార్ మృతి చెందడంతో స్వగ్రామం ఉదుగూరులో విషాదఛాయలు అలముకున్నాయి.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీలో పలువురికి చోటు


ఎల్‌ఎం మోహన్‌రెడ్డి


చౌళూరు మధుమతిరెడ్డి

పుట్టపర్తిటౌన్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన పలువురు నాయకులకు చోటు దక్కింది. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురం పార్లమెంట్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శులుగా కె.రమేష్‌రెడ్డి, నిట్టూరు రఘునాథ్‌రెడ్డి, నార్పల సత్యనారాయణరెడ్డి, హిందూపురం పార్లమెంట్ పరిధిలో రాష్ట్ర కార్యదర్శులుగా ఎల్‌ఎం మోహన్‌రెడ్డి, చౌళూరు మధుమతిరెడ్డి, బోయ తిప్పేస్వామి నియమితులయ్యారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలను వీరికి కేటాయించనున్నారని, వీరు పార్టీ కేంద్ర కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ సంబంధిత రీజినల్ కో ఆర్డినేటర్లు, పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులకు సహాయకారిగా వ్యవహరిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పాత వాహనాల వేలానికి ఏర్పాట్లు


వేలం వేసేందుకు వాహనాలను వరుసగా ఉంచిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం అర్బన్: కలెక్టరేట్ ఆవరణలో ఉంచిన పాత వాహనాలను వేలం వేసేందుకు మోక్షం కలిగింది. ఈ నెల 7న 'ఇతరులకు చెబుతాం... ఆచరించం' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. పాత వాహనాలు వేలం వేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీంతో కలెక్టరేట్ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టి వాహనాలను ఒక క్రమంలో ఏర్పాటు చేయించారు. వాటి విలువ నిర్ధారించేందుకు ఆర్టీఏ అధికారులకు లేఖ రాశామని చెప్పారు. ఇదిలా ఉండగా వాహనాల స్థితిని పరిశీలిస్తే అవి గుజరీకి తప్ప మరెందుకూ పనికిరావని పలువురు ఉద్యోగులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

నేటి నుంచి మస్తానయ్య ఉరుసు


మస్తానయ్య దర్గా

గుంతకల్లు: పాతగుంతకల్లులో వెలిసిన హజరత్ సయ్యద్ మస్తాన్‌వలి స్వామి 390వ ఉరుసు ఉత్సవాలు ఆదివారం అర్ధరాత్రి ప్రారంభమవుతాయని వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ రహీం తెలిపారు. కులమతాలకు అతీతంగా మూడు రోజులు పాటు జరిగే ఈ ఉరుసు ఉత్సవాలకు దక్షిణ భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వస్తారని పేర్కొన్నారు. భక్తుల కోసం తాగునీరు, తాత్కాలిక టాయిలెట్లు, దర్గా ఖాళీ ప్రదేశాల్లో షామియానాలు తదితర సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. మున్సిపల్ అధికారుల సహాయంతో నీటి ట్యాంకర్లు కూడా అందుబాటులో ఉంచామన్నారు. తొలిరోజు ఆదివారం గంధం మహోత్సవం, సోమవారం షంషీర్ (ఉరుసు ఉత్సవం), మంగళవారం జియారత్ కార్యక్రమంతో ఉరుసు ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు. దర్గా ఉత్తర, దక్షిణ భాగాల్లో ఉన్న ఆర్చ్‌లతో పాటు దర్గా ప్రాంగణాలు విద్యుత్ దీపాలతో అందంగా అలకరించామని తెలిపారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీసీ కెమెరాల నిఘా నీడలో వందలాది మంది పోలీసులచే భారీ బందోబస్తు నిర్వహించనున్నట్లు చెప్పారు.

విద్యార్థినికి విషపురుగు కాటు


ఆస్పత్రిలో విద్యార్థిని ధనశ్రీ

ఉరవకొండ: విష పురుగు కాటుతో విద్యార్థిని అస్వస్థతకు గురైన ఘటన ఉరవకొండలో జరిగింది. వివరాలు.. స్థానిక ఎస్కే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని ధనశ్రీ శనివారం పాఠశాలలో ప్రార్థన చేస్తున్న సమయంలో ఒక్కసారిగా కింద పడింది. తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఏమైందని ఆరా తీయగా.. తనకు ఏదో కుట్టిందని చెప్పింది. దీంతో టీచర్లు వెంటనే ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ధనశ్రీది వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి తండా గ్రామం కాగా, ఉరవకొండలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో ఉంటూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటోంది.